ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 251
గురువారం 24 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



# రాయలసీమకు లక్ష కోట్ల వరం..

**అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన**

**లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ఆరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలు**

**నిర్మలా సీతారామన్‌తో కలిసి ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**

**రిలయన్స్ ఏర్పాటు చేయనున్న అగ్రికల్చర్ స్కూల్‌కు కూడా అంకురార్పణ**

**వరుస కార్యక్రమాలతో ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు బిజీ బిజీ**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)**

దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న రాయలసీమ రూపురేఖలను మార్చే బృహత్తర ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు లక్ష కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది. అక్టోబర్ 2వ తేదీన మదనపల్లెలో జరిగే కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా సీమ రైతాంగ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద ఈ రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు అందనుండగా, మరో రూ.60 వేల కోట్లను ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించనున్నారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నీరందిస్తూనే, మరోవైపు ఉద్యానవన పంటలను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతాల్లో సంపద సృష్టించి, రైతుల ఆదాయాన్ని పెంచడమే ఈ హబ్ ప్రధాన ఉద్దేశం. ఇదే కార్యక్రమంలో భాగంగా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా ▶2లో

## ఉత్తరాంధ్ర పెద్దదిక్కుకు కష్టాలు.. సొంత నియోజకవర్గానికే పరిమితమవ్వక తప్పదా?



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)**

ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి, మండలిలో విపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ కు ఊహించని కష్టాలు ఎదురవుతున్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న బొత్స తాజా రాజకీయ పరిణామాలతో సొంత నియోజకవర్గానికి పరిమితం అవ్వాల్సిన పరిస్థితులు దాపురించాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇన్నాళ్లు తన తరుపున రాజకీయ వ్యవహారాలు అన్నీ పర్యవేక్షించిన మేనల్లుడు, విజయనగరం జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను అనూహ్యంగా పార్టీ ఫిరాయించడంతో బొత్స కంగుతినాల్సివచ్చిందని అంటున్నారు. చిన్న శ్రీను టీడీపీలో చేరడంతో సొంత నియోజకవర్గం చీపురుపల్లి వ్యవహారాలలో అనిశ్చితి నెలకుందని, దీంతో తానే స్వయంగా రంగంలోకి దిగాలని బొత్స నిర్ణయించుకున్నారని అంటున్నారు.జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను రాజీనామా తర్వాత పార్టీ నుంచి ఇంకెవరు చేజారిపోకుండా బొత్స అప్రమత్తమయ్యారని అంటున్నారు. తాను రాష్ట్ర రాజకీయాల్లో బిజీగా ఉండటంతో జిల్లాతో పాటు సొంత నియోజకవర్గం వ్యవహారాలను చిన్న శ్రీనుకే అప్పగించారు. ఇప్పుడు అదే పెద్ద సమస్యగా పరిణమించిందని బొత్స భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఇకపై తాను చీపురుపల్లిలోనే ఉంటానని, కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా తనకే నేరుగా ఫోన్ చేయాలని బొత్స చెబుతుండటంపై కార్యకర్తల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఒకప్పుడు తమకు అందుబాటులో లేకుండా బిజీబిజీగా తిరిగిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను ఇచ్చిన ఝలక్ తో క్షేత్రస్థాయి రాజకీయాలను స్వయంగా చూసుకోవాల్సిన పరిస్థితికి ▶2లో

## ప్రతి గడపకూ ఆరోగ్య సంరక్షణ.. ఆయుష్మాన్ భారత్‌పై మోదీ



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 23)**

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పథకం ఆయుష్మాన్ భారత్ . ఈ పథకం ప్రారంభమై ఎనిమిదేళ్లు పూర్తైన సందర్భంగా ప్రధాని మోదీ (ఖీ ఛీఖీవఅతీఖీ వీశీఎఖ) సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆయుష్మాన్ భారత్ కింద 60 కోట్ల మంది లబ్ధిదారులు ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా రక్షణను పొందుతున్నట్లు తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకంగా నిలిచిందని కొనియాడారు. ప్రతి గడపకూ ఆరోగ్య సంరక్షణ చేరుతుండడంతో.. ▶2లో

## నో రాజీ....ఎక్కువ సీట్లలోనే జనసేన ?



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ విషయంలో జనసేన పక్కా క్లారిటీతో ఉంది. ఎక్కడా రాజీ పడే ప్రసక్తి లేకుండా బలం ఉన్న చోట్ల పోటీకి సిద్ధపడాలని చూస్తోంది. ఇక పిఠాపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఏపీలో కూటమి బలంగా ఉండాలని గట్టిగా కోరుకున్నారు. అదే సమయంలో జనసేన ఆత్మగౌరవానికి భంగం కలగకుండా అంతా కలిసి ముందుకు సాగుతామని అన్నారు. ఇక పవన్ ఆధ్వర్యంలో జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర కీలక నాయకుల ▶2లో

## జగన్ జాగ్రత్త గవర్నర్ వద్దకు వైసీపీ !



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)**

ఏపీలో మెగా డీఎస్సీ రాజకీయ సమరంగా మారిపోయిన సంగతి తెలిసిందే. విజయవాడలోని శాప్ ఆఫీసు వద్ద సోమవారం జరిగిన వైసీపీ నిరసన దరిమిలా ఇది మరింతగా రాజుకుంది. ఇపుడు ఏపీలో అరెస్టుల పర్వం సాగుతోంది. టీచర్ల మీద వైసీపీ నేతలు దాడి చేశారు అంటూ పలువురు వైసీపీ నేతలను పోలీసులు అరెస్టు చేస్తూంటే వైసీపీ మరింత తీవ్రంగా రియాక్ట్ అవుతోంది. ఫేక్ నిరసనలతో తమకు పోటీగా చేయించి తమపైన దాడులు చేశారని మండిపడుతోంది. దీని మీద తాము తగ్గేది లేదని జగన్ అంటున్నారు. వైసీపీ శాంతియుతంగా ర్యాలీలు నిర్వహిస్తే టీడీపీ ప్రోత్సాహంతో వారి మీద దాడులు జరిగాయని వైసీపీ అంటోంది. దీని మీద పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

**ఇది తీవ్రమైన అంశం :**

ఏపీలో శాంతియుతంగా నిరసనలు నిర్వహించుకునే అవకాశం లేదా అని జగన్ పార్టీ నేతలతో మాట్లాడుతూ ప్రశ్నించినట్లుగా చెబుతున్నారు. దీని మీద గవర్నర్ ని కలవాలని వైసీపీ నిర్ణయించింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ కి మెగా డీఎస్సీలో ▶2లో

# టీడీపీపైనా పోటీ!?

## ఫ్రెండ్లీ కంటెస్ట్ కు పవన్ గ్రీన్ సిగ్నల్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)**

స్థానిక ఎన్నికల్లో పొత్తులు ఉన్నప్పటికీ బలం ఉన్నచోట పోటీ చేస్తామంటే అభ్యంతరం లేదని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిరేపుతున్నాయి. పొత్తులు ఉన్నా, స్నేహపూర్వక పోటీకి కార్యకర్తలు సిద్ధమైతే అడ్డుచెప్పొద్దని పార్టీ నేతలకు పవన్ సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కాకినాడలో నిర్వహించిన జనసేన సన్నాహక సమావేశంలో పవన్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు. పార్టీ అంతర్గత సమావేశంలో మీడియాను అనుమతించినప్పటికీ పార్టీ నేతల సమాచారం మేరకు పోటీపై పవన్ ఊహించని ప్రసంగంతో కార్యకర్తలనే ఆశ్చర్యానికి గురిచేశారని చెబుతున్నారు.

**పార్టీ కోసమే స్థానిక ఎన్నికలు**

సాధారణ ఎన్నికలు ప్రజల కోసం, స్థానిక ఎన్నికలు పార్టీ బలోపేతం కోసం అంటూ పవన్ సరికొత్త భాష్యం చెప్పారు. పార్టీని బలోపేతం చేసుకోడానికి ఈ ఎన్నికలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ▶2లో

## తీవ్ర వాయుగుండం.. సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)**

రాష్ట్రానికి తీవ్ర వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలపై అత్యవసర సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం-కవిటి మధ్య నేటి మధ్యాహ్నం తీవ్ర వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 85 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. శ్రీకాకుళం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా వరకు ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉందన్నారు. ▶2లో



## వైసీపీకి కొత్త రూపు... ముహూర్తం అపుడేనా ?

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 23)**



వైసీపీ అంటే ఠక్కున చాలా మంది నాయకుల పేర్లు కళ్ళ ముందు మెదులుతాయి. వైసీపీలో కాంగ్రెస్ ఉంది. కాంగ్రెస్ నుంచి వచ్చిన నాయకులు అనేక మంది ఆ పార్టీలో ఉన్నారు. వారితోనే వైసీపీ రాజకీయ ప్రస్థానం సాగుతూ వస్తోంది. అయితే వరుసగా మూడు ఎన్నికలను చూసి ఒకసారి అధికారంలోకి వచ్చిన వైసీపీకి 2029 ఎన్నికలు చాలా కీలకం అని ప్రత్యేకంగా చెప్పాల్సింది లేదు. అదే సమయంలో వైసీపీకి కొత్త నాయకత్వం

## ఆశావహంగా భారత్ ఆర్థిక వ్యవస్థ: జేపీ మోర్గాన్ సీఈవో

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 23)**

భారత్‌ను ఇప్పటికీ పెట్టుబడులకు అనుకూలమైన దేశంగానే ప్రపంచ స్థాయి ఇన్వెస్టర్లు చూస్తున్నారని జేపీ మోర్గాన్ ఛేస్ సీఈవో జేమీ డిమోన్ వెల్లడించారు. ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో చాలా మంది ఇన్వెస్టర్లు భారత్‌ను సానుకూల దృక్పథంతో చూస్తున్నారు. కాకపోతే పన్నుల వర్తింపు విషయంలో స్థిరత్వం లేకపోవడమే వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఈ విషయంలో నా వద్దకు చాలా సంస్థలు ఈ విషయాన్ని తీసుకొచ్చాయి. ఊహించిన స్థాయి కంటే అధికంగా పన్నులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి" అని వెల్లడించారు.



ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే ▶2లో

# ఉత్తరాంధ్ర పెద్దదిక్కుకు కష్టాలు.. సొంత నియోజకవర్గానికే పరిమితమవ్వక తప్పదా?

వచ్చారని వ్యాఖ్యానిస్తున్నారు. 1999 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర రాజకీయాల్లో దూకుడు చూపిన బొత్స ఇప్పుడు ఎక్కువగా సొంత నియోజకవర్గానికి పరిమితం అయిపోవాల్సిన పరిస్థితులు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. 2015లో కాంగ్రెస్ పార్టీని వీడి వైసీపీలో చేరినప్పటి నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీని సింగల్ హ్యాండ్ తో నడిపిన ఆయన ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటారని తాము ఊహించలేదని కార్యకర్తలు చెబుతున్నారు. డీసీసీబీ చైర్మన్ గా, ఎంపీగా విజయనగరం జిల్లాలో చక్రం తిప్పిన బొత్స 2004లో మంత్రి అయిన తర్వాత రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగరు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడిగా పని చేయడమే కాకుండా ఒకానొక సమయంలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలోకి వచ్చారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత రాజకీయాలు పూర్తిగా మారిపోవడం, కాంగ్రెస్ పార్టీ గల్లంతు కావడంతో బొత్స 2015లో వైసీపీలో చేరాల్సివచ్చిందని అంటున్నారు.

ఇక వైసీపీలో చేరిన తర్వాత కూడా బొత్సకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. ఐదేళ్లపాటు మంత్రిగా కొనసాగించడమే కాకుండా, ఉత్తరాంధ్ర పగ్గాలు అప్పగించారు. దీంతో సొంత నియోజకవర్గం, జిల్లా బాధ్యతలు మేనల్లుడు చిన్నశ్రీనుకు బొత్స అప్పగించాల్సివచ్చిందని, దీనివల్ల కేడర్ కు బొత్సకు మధ్య పెద్ద గ్యాప్ ఏర్పడిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక చిన్న శ్రీను నిష్క్రమణ తర్వాత ఈ విషయం గ్రహించిన బొత్స నష్ట నివారణ చర్యలు మొదలు పెట్టారని అంటున్నారు. ఈ క్రమంలో తాజాగా రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడిలా ఆయన తిరిగి దిగువస్థాయి నుంచి కార్యకర్తలతో సంబంధాలు పునరుద్ధరించు కునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ప్రతి గడపకూ ఆరోగ్య సంరక్షణ.. ఆయుష్మాన్ భారత్‌పై మోదీ

క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు.

**48.54 కోట్ల ఆయుష్మాన్ కార్డుల జారీ..**

ఆయుష్మాన్ భారత్ పథకం గురించి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ.. ఇప్పటివరకు 48.54 కోట్ల మంది ప్రజలకు ఆయుష్మాన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 39 వేలకు పైగా నమోదిత ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన వైద్య సేవలు అందించామన్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చుల భారం సామాన్య ప్రజలపై పడకుండా ఉండేందుకు.. సకాలంలో చికిత్స పొందేందుకు వీలుగా ప్రధాని మోదీ దార్శనికతతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ 2018లో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఝార్ఖండ్‌లో ప్రారంభించారు.

# నో రాజీ....ఎక్కువ సీట్లలోనే జనసేన ?

సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కూడా జనసేన బలం ఉన్న చోట పోటీ పడాలని నేతలు పేర్కొన్నట్లుగా తెలిసింది. అంతా కూర్చుని ఈ విషయంలో ఏకాభిప్రాయం సాధిస్తామని కూడా జనసేనలో ఒక నమ్మకం కనిపిస్తోంది.

**కార్యకర్తలకు చాన్స్ గా :** స్థానిక సంస్థల ఎన్నికలు అంటే జనసేన కార్యకర్తలకు మంచి అవకాశంగా చూస్తున్నారు. పార్టీ కోసం ఎంతగానో కష్టపడిన వారికి ఈ విధంగా అధికార పదవులు దక్కుతాయని అందువల్ల వారిని ప్రోత్సహించాలని జనసేన భావిస్తోంది అని అంటున్నారు. ఈ విషయంలో కూటమి పార్టీలను ఒప్పించి అయినా ఎక్కువ సీట్లు తీసుకోవాలని జనసేన చూస్తోంది అంటున్నారు. జనసేన బలం కూడా బాగా పెరిగింది అని విశ్లేషిస్తున్నారు. దాంతో ఈసారి తమ వాటా కూడా పోటీ చేసే విషయంలో ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. అధినేత పవన్ కళ్యాణ్ సైతం జనసేన బలోపేతానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఒక మంచి అవకాశంగా భావిస్తున్నారు అని అంటున్నారు. దాంతో ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 నాటి ఫార్ములా అన్నది కుదరదు అన్నట్లుగా జనసేన తేల్చేసింది అని అంటున్నారు. 15 శాతం సీట్లతో జనసేన పోటీ చేయదని ముందే చెప్పినట్లుగా 30 శాతం సీట్లను తీసుకుంటుందని అంటున్నారు.

**క్యాడర్ వేడి తగ్గింది :** ఇదిలా ఉంటే పిఠాపురంలో బహిరంగ సభలో పవన్ మాట్లాడుతూ జనసేన క్యాడర్ వేడి తగ్గిందని కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ తగ్గిన వేడిని మళ్లీ ఎలా తీసుకుని రావాలో తనకు బాగా తెలుసు అన్నారు. అధికారంలోకి వచ్చామని మెత్తబడితే కుదరదు అని క్యాడర్ కి ఆయన సందేశం ఇచ్చారు. ఇంకో వైపు చూస్తే పిఠాపురం నియోజకవర్గంలో జనసేన ఏర్పాటు చేసిన ఫైవ్ మెన్ కమిటీ పనితీరు మీద పవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కమిటీ పనితీరు బాగా లేదని అన్నారు. ఎలా సెట్ చేయాలో కూడా చూస్తామని అన్నారు. పిఠాపురంలో క్యాంప్ ఆఫీసుని ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.

**పనులు ఎలా చేయాలో తెలుసు :** తాను పిఠాపురంలోనే కూర్చుంటే పనులు కావని అన్నారు. ఏ పనులకు ఎక్కడ ఈ తీగ కదపాలో తనకు తెలుసు అని పవన్ అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడి ఉప్పాడ తీరం రక్షణ గోడ నిర్మాణానికి అనుమతులు తీసుకుని వచ్చామని పవన్ చెప్పారు. పిఠాపురాన్ని ఒక మోడల్ అసెంబ్లీ నియోజకవర్గంగా అభివృద్ధి విషయంలో చేస్తామని అన్నారు. ఈ విషయంలో చిత్త శుద్ధితో పనిచేస్తామని పవన్ స్పష్టం చేశారు.

**కృతజ్ఞత ఎక్కువ :** ఇదే సందర్భంలో పవన్ మరి కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తనకు కృతజ్ఞత ఎక్కువ అని అన్నారు. అలాగే ఎవరైనా కష్టంలో ఉంటే అండగా నిలుస్తాను అన్నారు. ఇది ఈ నేల నుంచి భారతీయ సంస్కృతి నుంచి తాను నేర్చుకున్నాను అని చెప్పారు. అదే సమయంలో జనసేన కోసం ప్రజల కోసం తాను చేయాల్సినవి చేస్తాను అని

## మొదటి పేజీ తరువాయి

కూడా చెప్పారు. మొత్తానికి పవన్ కృతజత అలాగే కష్టాల్లో అండగా ఉన్నామని చేసిన వ్యాఖ్యలు దేని గురించి అన్నది ఇపుడు చర్చ సాగుతోంది.

# జగన్ జాగ్రత్త ...గవర్నర్ వద్దకు వైసీపీ !

జరిగిన అవకతవకలను వివరించడమే కాకుండా సీబీఐ విచారణ కోసం టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఆదేశించాలని జగన్ నాయకత్వంలో వైసీపీ బృందం కోరనుంది అని అంటున్నారు. అలాగే విజయవాడలో శాప్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమాల నేపథ్యంలో వైసీపీ కార్యకర్తల మీద దాడులు చేశారు అని గవర్నర్ దృష్టికి తీసుకుని రావాలని వైసీపీ నిర్ణయించింది. దీంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది అని అంటున్నారు.

**లోకేష్ స్ట్రాంగ్ వార్నింగ్ :**

మరో వైపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాజాగా పర్యటించిన విద్యా శాఖ మంత్రి టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ జగన్ కి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. జగన్ జాగ్రత్తగా ఉండు అని ఆయన హాట్ కామెంట్స్ చేయడం విశేషం. మా టీచర్ల మీద వైసీపీ వారితో దాడులు చేయిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ విధంగా చేయాలని చూస్తే దబిడి దిబిడే అని గట్టిగానే స్పష్టం చేశారు. జగన్ మాదిరిగా తాను లేను అని ఆయన అన్నారు. జగన్ విదేశాలకు వెళ్ళాలీ అంటే కోర్టు నుంచి అనుమతి తెచ్చుకోవాలని ఎద్దేవా చేశారు. తాము నిజాయితీగా ఉంటున్నామని తప్పు చేయడం అన్నది లేనే లేదని లోకేష్ స్పష్టం చేశారు.

**చర్చకు సవాల్ చేసినా :** మెగా డీఎస్సీ మీద తాను చర్చకు సిద్ధం అని సవాల్ చేసినా జగన్ ఎందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. తాము పారదర్శకంగా ఉన్నాం కాబట్టే చర్చకు పిలుస్తున్నామని అన్నారు. మెగా డీఎస్సీ మీద లేని పోని నిందలు వేస్తే చూస్తూ ఊరుకునేది లేదని లోకేష్ హెచ్చరించారు. ఇదిలా ఉంటే ఎన్నడూ లేని విధంగా జగన్ మీద లోకేష్ బిగ్ సౌండ్ చేశారు. జగన్ జాగ్రత్త అని నేరుగానే వార్నింగ్ ఇవ్వడం ఇపుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. మరి ఇది ఏ కీలక మలుపు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

# టీడీపీపైనా పోటీ!?

అందుకే కూటమి పొత్తులపై ప్రభావం చూపని విధంగా బలం ఉందని భావిస్తే స్నేహపూర్వక పోటీకి సిద్ధమవ్వాలని ఆయన సూచించినట్లు చెబుతున్నారు. బలం ఉన్న ప్రతి చోట జనసేన పోటీలో ఉంటుందని పవన్ స్పష్టం చేశారు.

**గెలిచే స్థానాలు గుర్తించాలి**

లోక్ సభ స్థానాల వారీగా గెలిచే అవకాశాలు ఉన్న స్థానాలను పార్టీ నేతలు గుర్తించాలని పవన్ సూచించారు. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రాభివృద్ధి కోసం త్యాగాలు చేశామని, కానీ స్థానిక ఎన్నికల్లో అటువంటి పరిస్థితి అవసరం లేదని పవన్ వ్యాఖ్యానించారని అంటున్నారు. జనసేన పార్టీని బలోపేతం చేసుకునేందుకు ఇదే సరైన సందర్భమని ఆయన భావించినట్లు చెబుతున్నారు. ఎక్కడ గెలుస్తామో అక్కడే పోటీ చేద్దాం, వందశాతం ఫలితాలు సాధిద్దాం అంటూ పవన్ కేడర్ కు దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు.

**లోకేశ్ పేరు ప్రస్తావించకుండానే..**

ఇక కూటమి పొత్తుల్లో భాగంగా జనసేనకు 15 శాతం సీట్లు ఇస్తామని గతంలో మంత్రి లోకేశ్ చేసిన ప్రకటనపైనా పవన్ స్పందించారు. మంత్రి లోకేశ్ పేరు ప్రస్తావించకపోయినా జనసేన పోటీపై పర్సెంటేజీల లెక్కలు ప్రచారంలో ఉన్నాయని, నిజంగా వాళ్లు అలా మాట్లాడారో లేదో తనకు తెలియదు కానీ, జనసేన మాత్రం బలం ఉన్న ప్రతిచోటా పోటీ చేస్తుందని మరోసారి పునరుద్ఘాటించారని చెబుతున్నారు. ఇక సీట్ల సర్దుబాటు జిల్లాస్థాయిలోనే జరిగిపోవాలని, తప్పనిసరి పరిస్థితులు ఉంటేనే తాను, ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటామని పవన్ స్పష్టం చేశారని అంటున్నారు.

**చేరికలపై కీలక సూచనలు**

సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, ఎంపీల గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలను గుర్తించాలని పవన్ సూచించారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పెద్దపీట వేయాలని సూచించారు. ఇదే సమయంలో చాలా మంది కార్యకర్తలు అధికారం వచ్చిన తర్వాత చల్లబడిపోయారని పవన్ వ్యాఖ్యానించారు. అధికారం ఉన్నా, లేకపోయినా కార్యకర్తల్లో వేడి తగ్గకూడదని, కసితో పనిచేయాలని పవన్ సూచించారు. మరోవైపు స్థానిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని చాలా చోట్ల నేతలు పార్టీలో చేరుతామని ముందుకొస్తున్నారని, మంచి ట్రాక్ రికార్డు ఉన్నవారిని మాత్రమే పార్టీలో చేర్చుకోవాలని పవన్ పార్టీ నేతలకు సూచనలు చేశారని చెబుతున్నారు.

# రాయలసీమకు లక్ష కోట్ల వరం..

శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ రంగంలో అత్యున్నత ప్రమాణాలతో ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.

**వరుస కార్యక్రమాలతో సీఎం బిజీ**

ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటూ తీరిక లేకుండా గడపనున్నారు.

సెప్టెంబర్ 29: ఉదయం విజయవాడలో జరిగే ఋూ౹ు కర్మయోగి మిషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించే 'పల్లె పండుగ'కు హాజరవుతారు.

సెప్టెంబర్ 30: విజయవాడలో 24 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

అక్టోబర్ 1: రాష్ట్రవ్యాప్తంగా జరిగే 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు.

అక్టోబర్ 2: గాంధీ జయంతి సందర్భంగా ఉదయం మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం విజయవాడలో జరిగే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.

అక్టోబర్ 3: విజయవాడలో జరిగే పాన్ ఐఐటీ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ వరుస కార్యక్రమాలతో సీఎం ఐదు రోజుల పాటు ప్రజలతో మమేకం కానున్నారు.

# వైసీపీకి కొత్త రూపు... ముహూర్తం అపుడేనా ?

అవసరం అని అధినాయకత్వం అభిప్రాయపడుతోంది అంటున్నారు. టీడీపీ అయితే ఇప్పటికే చాలా చోట్ల సీనియర్ల స్థానంలో చాలా స్మూత్ గా కొత్త నాయకులను యంగ్ బ్లడ్ ని తెచ్చి పెడుతోంది. 2029 ఎన్నికల నాటికి చూస్తే టీడీపీ పూర్తిగా యువ బృందంతో రంగంలోకి దిగుతుంది అని అంటున్నారు. అదే వైసీపీలో చూస్తే సీనియర్ నేతలే అత్యధిక శాతం కనిపిస్తున్నారు అని ఒక మాట ఉంది.

**యువతరానికి స్వాగతం :** వైసీపీలో యువ తరానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధినాయకత్వం భావిస్తోంది అని అంటున్నారు. అదే సమయంలో సీనియర్ల అనుభవాలను వాడుకోవాలని ఈ రెండూ మేళయించి మంచి కో ఆర్డినేషన్ తో ముందుకు సాగాలని చూస్తోంది అంటున్నారు. ఉద్యమాలు చేయాలంటే యూత్ లీడర్లే ముందుకు వస్తారని వారితోనే పార్టీకి ఊపూ ఉత్సాహం వస్తాయని కూడా భావిస్తున్నారు. అదే విధంగా జెన్ జీ ప్రభావం కూడా వైసీపీ అధినాయకత్వంలో సరికొత్త ప్రయోగాలు చేసేలా చేస్తోంది అంటున్నారు. తరచూ జగన్ నోట జెన్ జీ అన్న మాట రావడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. దాంతో పార్టీలో కూడా యువతకు పట్టం కడితే ఆటోమేటిక్ గా జెన్ జీని ఎట్రాక్ట్ చేయగలని తలపోస్తున్నారు అని చెబుతున్నారు.

**అక్కడతో మొదలు :** తాజాగా చూస్తే వైసీపీలో ఒక నియామకం అందరినీ ఆలోచింపచేస్తోంది. నెల్లిమర్ల వంటి కీలక స్థానంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుని తప్పించి మూడున్నర పదుల వయసు కలిగిన యువ నేత సన్యాసినాయుడుకు చాన్స్ ఇచ్చారు. దాంతో అంతా దీని మీద విశ్లేషిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనే పోటీ చేస్తారు అని అంటున్నారు. ఈ విధంగా నాలుగు పదుల లోపు యువతకు పెద్ద పీట వేయాలన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు. వైసీపీని చాలా మంది నేతలు వీడారు. ఆయా చోట్ల కొత్త వారికి చాన్స్ అంటే ముందుగా యూత్ కే ప్రయారిటీ ఇస్తున్నారు అని అంటున్నారు. వైసీపీలో సగటు నాయకుల ఏజ్ 50 లోపు ఉండేలా చూసుకోవాలన్న భావన కూడా వ్యక్తం అవుతోంది అని అంటున్నారు. ఆ విధంగా చూస్తే శ్రీకాకుళం నుంచి అనంతపురం జిల్లా దాకా ఈ తరహా నాయకత్వం ఇప్పటికే కొందరిని తయారు చేసి ఉంచారని ముందు ముందు మరింతగా వీరి సంఖ్యను పెంచుతారు అని అంటున్నారు.

**లోకల్ ఫైట్ తరువాతనే :** జగన్ పదే పదే స్థానిక సంస్థల ఎన్నికల గురించి పార్టీ నాయకులకు చెబుతున్నారు. ఈ ఎన్నికలు చాలా ముఖ్యమని కూడా హెచ్చరిస్తూ వస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ఏకపక్షాలు ఏకగ్రీవాలు కూటమి వైపు నుంచి ఉండకూడదని ఆయన అంటున్నారు. అలా జరిగితే ఇంచార్జి పదవికే ముప్పు అని చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ఏకగ్రీవాలు అనేక చోట్ల జరుగుతాయని అంటున్నారు. దాంతో వాటి ఫలితాలను చూసిన తరువాత వైసీపీలో ప్రక్షాళనకు జగన్ సిద్ధపడతారు అని అంటున్నారు. మొత్తంగా చూస్తే ముహూర్తం అయితే ఫిక్స్ అయినట్లే అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ఆశావహంగా భారత్ ఆర్థిక వ్యవస్థ: జేపీ మోర్గాన్ సీఈవో

ప్రభుత్వం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ప్రభుత్వ దీర్ఘకాలిక బాండ్లపై సంపాదించే లాభాలు, ఆదాయంపై పన్ను మినహాయింపును ఇచ్చిందని డిమోన్ వెల్లడించారు. దీంతోపాటు ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులు దీర్ఘకాలిక బాండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించిందన్నారు. రూపాయి విలువ మరింత పతనం కాకుండా ఈ నిర్ణయం తీసుకొందన్నారు. వాస్తవానికి ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం దాదాపు రెండు నెలలపాటు తీవ్ర స్థాయిలో అంతర్గత చర్చలు జరిపిందని వెల్లడించారు.

**5 రోజులు బ్యాంకింగ్ సేవలు ఉండవా?**

అంతేకాదు.. భారత్‌లో పోటీపడటానికి విదేశీ కంపెనీలను ఈ మార్కెట్‌లో ఓ పట్టాన అనుమతించరన్నారు. ఫలితంగా భారత్ తక్కువ మొత్తంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని వెల్లడించారు. మార్కెట్లో పోటీ తత్వం భారత్‌కు మంచే చేస్తుందన్నారు.

# తీవ్ర వాయుగుండం.. సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి నదులు, వాగులు, వంకల్లో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశించారు. సీఎస్, డీజీపీతో పాటు మంత్రులు, వివిధ శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించిన సీఎం.. రిజర్వాయర్లలో నీటి నిల్వలకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని దిశానిర్దేశం చేశారు. 261 మండలాల్లో వర్షాలపై ప్రత్యేక అంచనాలు ఉన్నందున 24, 25 తేదీల్లోనూ అప్రమత్తత కొనసాగించాలని సూచించారు.

# యువత అప్రమత్తంగా ఉంటే హెచ్ఐవీ వ్యాప్తికి అడ్డుకట్ట యువత అప్రమత్తంగా ఉండాలి




## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

## హెచ్ఐవీ నివారణ పై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం

## అపోహలు వీడి బాధితుల పట్ల వివక్ష చూపొద్దని పిలుపు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 23)**

ఎయిడ్స్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. యువత హెచ్ఐవీ, ఎయిడ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద బుధవారం నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ముఖ్యంగా యువత హెచ్ఐవీ సంక్రమించే మార్గాలు, నివారణ పద్ధతుల పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ ప్రధానంగా అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషిత రక్తం, కలుషితమైన సూదులు లేదా సిరంజీలను పంచుకోవడం వంటి మార్గాల ద్వారా సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే గర్భధారణ, ప్రసవం, తల్లిపాలు ఇచ్చే సమయంలో తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించే ప్రమాదం ఉందని వివరించారు. ఈ సంక్రమణను నివారించేందుకు గర్భిణులు వైద్యుల సూచనల మేరకు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. హెచ్ఐవీపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని, బాధితుల పట్ల వివక్ష చూపకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. అవగాహన కార్యక్రమాల్లో యువత, ప్రజలు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి కె రాహుల్, డాక్టర్ సాయికిరణ్, దిశా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 23)**

స్థానిక ఆయుర్వేద ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఆయుర్వేద వైద్యరాలు కె వి పద్మజాకుమారి ఆధ్వర్యంలో ధన్వంతరి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయుర్వేద వైద్య విధాన ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయటం పాటు ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం అందించే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు గుమ్మడి వర్ధన రాజు, గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
24.09.26 గురువారం

## కడపలో పోలీసుల భారీ దాడి

**9 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్**

**రూ.కోట్లలో విలువ చేసే 1.810 టన్నుల ఎర్రచందనం దుంగలు, 5 వాహనాలు సీజ్**





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టంబర్ 2)**
జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మన్నూరు, వీరబల్లి, ఖాజీపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన సంయుక్త దాడుల్లో 9 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు జిల్లా నూతన ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వెల్లడించారు. వీరి నుంచి సుమారు 1.810 టన్నుల బరువున్న 87 ఎర్రచందనం దుంగలతో పాటు రవాణాకు ఉపయోగించిన 5 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మన్నూరులో 42 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఖాజీపేటలో 37 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. అదే విధంగా వీరబల్లిలో 8 ఎర్రచందనం దుంగలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ నరికివేత, నిల్వ, కొనుగోలు, రవాణా పై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎర్రచందనం నరికినా, దాచినా, కొనుగోలు చేసినా లేదా రవాణా చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు. అక్రమ రవాణాకు సహకరించిన ▶4లో

# త్రిశూల్ పై విస్తృత అవగాహన కల్పించాలి

**ప్రమాదకర కూడళ్లలో 'వన్ హాట్‌స్పాట్-వన్ ఆఫీసర్' విధానం**

**54 ప్రమాదకర రహదారులపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన**

**మాదక ద్రవ్యాల వినియోగం, మహిళల పై అఘాయిత్యాలు తగ్గాయి**

**జిల్లా కలెక్టర్, ఎస్పీ లు పి రాజాబాబు, హర్షవర్ధన్‌రాజు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 23)**
మాదక ద్రవ్యాల వినియోగ నివారణ, మహిళా రక్షణ, రహదారి భద్రతకు సంబంధించి ప్రభుత్వం సూచించిన 'త్రిశూల్' కార్యక్రమం పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. ప్రమాదకర కూడళ్లను గుర్తించి 'వన్ హాట్‌స్పాట్-వన్ ఆఫీసర్' విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల వినియోగ నిరోధం, మహిళా సంరక్షణ, రహదారి భద్రతపై నిర్వహించిన త్రిశూల్ కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.

**ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా....**జిల్లాలోని 54 ప్రమాదకర రహదారులపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారులపై సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అవసరమైతే వైఫై సదుపాయాన్ని వినియోగించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణతో పాటు గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. గతంతో పోలిస్తే జిల్లాలో చేపట్టిన పలు చర్యల కారణంగా మహిళలపై అఘాయిత్యాలు తగ్గాయని కలెక్టర్ తెలిపారు. 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.



**ప్రతి విద్యాసంస్థలో అవగాహన కార్యక్రమాలు**

త్రిశూల్ కార్యక్రమంపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వినూత్నంగా నిర్వహిస్తున్న 'యువ సాథీ' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు త్రిశూల్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు నియమించిన మెంటార్లకు కూడా కార్యక్రమంపై అవగాహన కల్పించి, 'నో బ్యాగ్ డే' సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో త్రిశూల్‌పై అవగాహన పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**300కు పైగా కాన్వెక్స్ అద్దాల ఏర్పాటు**

ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం, మహిళలపై అఘాయిత్యాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. రహదారి భద్రతలో భాగంగా ప్రమాదాల నివారణకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 300 కాన్వెక్స్ అద్దాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో అవుట్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శ్రీశైలం ఘాట్ రోడ్డులో సుమారు 18 కాన్వెక్స్ అద్దాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నియంత్రించినట్లు వివరించారు. హైవేలపై హెచ్చరికలతో పెయింటింగ్జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. హైవేలపై 'ముందు జంక్షన్ ఉంది', 'నిదానంగా వెళ్లండి' ▶4లో

## వెలిగొండ నిర్వాసితుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం



**7,321 మంది నిర్వాసితుల్లో**

**6,960కుపైగా అవార్డులు పాస్**

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 23)**
వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 7,321 మంది నిర్వాసితులు ఉండగా, 6,960కుపైగా అవార్డులు పాస్ చేసినట్లు వెల్లడించారు. ▶4లో



## రోడ్డు ప్రమాద రహిత మార్కాపురం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**

**ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి**

**గుంతలు లేని రహదారులే లక్ష్యంగా శాఖల సమన్వయం**

**ప్రజా అవగాహనకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 23)**
రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు ప్రాణనష్టాన్ని అరికట్టడానికి సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, సమగ్ర కార్యాచరణ రూపొందించాలని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. రోడ్డు భద్రతా సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణనష్టం జరిగే ప్రమాదాలు అరికట్టడానికి రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా రవాణా, పోలీసు శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని, హెల్మెట్ ప్రాముఖ్యతపై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులను పరిశీలించి, గుంతలు ఉన్న చోట్ల తక్షణమే మరమ్మతులు చేపట్టి రహదారులను సురక్షితంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పై ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ప్రమాదకర మలుపులు, ▶4లో



## ఆగిన వైద్యానికి ఎమ్మెల్యే హామీతో కొత్త ఊపిరి

**కడుపునొప్పితో సతమతమైన మహిళకు సీఎంఆర్ఎఫ్ సాయం**

**మనిషిగా స్పందించి..ప్రజాప్రతినిధిగా బాధ్యత నిర్వర్తించిన ఏలూరి**

**రూ.1.52 లక్షల చెక్కును అందించిన స్థానిక నేతలు**

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టంబర్ 23)**
నొప్పి భరించలేక ఆమె అల్లాడుతుంటే.. ఆ నొప్పికి మించిన ఆందోళన ఆ కుటుంబాన్ని కమ్మేసింది– డబ్బులు ఎక్కడి నుంచి తేవాలని అర్థం కాని పరిస్థితిలో స్థానిక నేతల సహకారంతో ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే ఆర్థిక సాయం అందించేలా ప్రత్యేక చొరవ చూపారు. అసలు కథ ఇలా....దేవరపల్లి కి చెందిన అలూరి కౌసల్య గుంటూరులోని ఆర్కే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నా, ఖర్చుల భారం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. వైద్యానికి సరిపడా డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కుటుంబానికి ఎమ్మెల్యే ఏలూరి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. ఆగ మేఘాల మీద ముఖ్యమంత్రి సహాయనిధికి లేఖ రాసి...ఆర్థిక సాయం అందేలా కృషి చేశారు.

**సమస్య తెలిసిన వెంటనే స్పందన**

కౌసల్య కుటుంబం పడుతున్న ఆవేదన ఎమ్మెల్యే దృష్టికి రాగానే, ఆయన ఏమాత్రం జాప్యం చేయలేదు. వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేయాలంటూ నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ఒక సామాన్య మహిళ కష్టాన్ని అంత సీరియస్‌గా తీసుకుని, ఉన్నత స్థాయిలో విజ్ఞప్తి చేయడం వెనుక ఆయనలోని మానవీయ కోణం స్పష్టంగా కనిపిస్తుంది. ▶4లో

# కడపలో పోలీసుల భారీ దాడి



వారిని కూడా నేరస్తులుగానే పరిగణించి కేసులు నమోదు చేస్తామన్నారు. పదే పదే నేరాలకు పాల్పడే పునరావృత నేరస్తుల పై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సంబంధించి సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను జిల్లా నుంచి పూర్తిగా రూపుమాపేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, అక్రమార్కుల ఆట కట్టిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

# త్రిశూల్ పై విస్తృత అవగాహన కల్పించాలి

వంటి హెచ్చరికలతో పెయింటింగ్‌లు వేయించినట్లు చెప్పారు. పలు ప్రాంతాల్లో పీఏ సిస్టమ్ ద్వారా ప్రజలకు హెచ్చరికలు, సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. శక్తి టీమ్‌ల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈగల్ టీమ్‌ల ఏర్పాటు ద్వారా కూడా మంచి ఫలితాలు వస్తున్నాయని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం, ఆర్డీవోలు చంద్రశేఖర్ నాయుడు, జ్యోతి కుమారి, డీటీసీ సుశీల, ఐసీడీఎస్ పీడీ పద్మ సునంద, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, డీపీఓ అనుపమ, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆగిన వైద్యానికి ఎమ్మెల్యే హామీతో కొత్త ఊపిరి

**ఫలించిన విజ్ఞప్తి.. లభించిన ఊరట**

ఎమ్మెల్యే విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి కార్యాలయం, కౌసల్య చికిత్స కోసం రూ.1,52,249 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ని మంజూరు చేసింది. ఆర్థిక భారంతో సతమతమవుతున్న ఆ కుటుంబానికి ఇది కంటిమీద కునుకు లేకుండా చేసిన ఆందోళనకు తెరదించింది.

**వైద్యం ఆగకూడదు అనే సంకల్పంతో..**

పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరి చికిత్సా నిలిచిపోకూడదన్న సంకల్పంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అర్హులైన వారికి సాయం అందిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే వైద్య సహాయ అభ్యర్థనలను స్వయంగా పరిశీలించి, సత్వర సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించాయి. ఈ ఎల్‌ఓసి చెక్కును స్థానిక నేతలు కుటుంబానికి అందజేశారు. తక్షణమే స్పందించి ఎల్‌ఓసి అందేలా కృషిచేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కుటుంబ సభ్యులు స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన సచివాలయ సెక్రటరీ



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 23)**

జమ్మలమడక గ్రామంలో బుధవారం పలు పారిశుద్ధ్య కార్యక్రమాలను స్వయంగా సచివాలయ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ పరిశీలించడం జరిగింది. వర్షాలను దృష్టిలో పెట్టుకొని మురుగు కాలవలలో వర్షపు నీరు చెత్తాచెదారం నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించడం జరిగింది. వర్షపు నీరు రోడ్లమీదకు చేరకుండా విష జ్వరాలు ప్రబలకుండా స్వయంగా తానే పారిశుద్ధ్య పనులను చేయించడం పట్ల జమ్మలమడక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాద రహిత మార్కాపురం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత



బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యల పై స్పష్టమైన పురోగతి చూపాలని, వివిధ శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉన్న త్రిపురాంతకం, దోర్నాల, కనిగిరి, మార్కాపురం టౌన్, రూరల్ బేస్తవారిపేట పోలీస్ స్టేషన్ పరిధుల్లో రవాణా, పోలీస్, ఆర్‌అండ్‌బి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి భద్రతా చర్యలు ముమ్మరం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల ప్రాణాల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, రోడ్డు నిబంధనలను ప్రతీ ఒక్కరూ పాటించి రోడ్డు ప్రమాద రహిత మార్కాపురం నిర్మాణానికి సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# వెలిగొండ నిర్వాసితుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం

ఇప్పటివరకు 6,151 మంది నిర్వాసితులకు రూ.7.58 కోట్ల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన బిల్లుల చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం మేజర్ సన్స్, మేజర్ డాటర్స్, 18 ఏళ్లు పూర్తయిన వారు, నూతన నిర్మాణాల కేటగిరీలకు చెందిన నిర్వాసితుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం 11 కౌంటర్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని 11 గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయ సునీత కోరారు.

# ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ

## స్టేట్ టూరిజం కమిటీ వైస్ చైర్మన్‌గా యెలిశెట్టి వెంకట గురుప్రసాద్ నియామకం

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 23)**



ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర స్థాయి కమిటీలలో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ప్రముఖ వైశ్య నాయకుడికి సముచిత స్థానం లభించింది. మైదుకూరు పట్టణానికి చెందిన యెలిశెట్టి వెంకట గురుప్రసాద్‌ను "ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ స్టేట్ టూరిజం కమిటీ వైస్ చైర్మన్"గా నియమిస్తూ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురుప్రసాద్ సమాజ శ్రేయస్సుకు, ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ ముఖ్యమైన బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా యెలిశెట్టి వెంకట గురుప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ తన పై ఉంచిన నమ్మకాన్ని పూర్తిస్థాయిలో నిలబెట్టుకుంటానని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య క్షేత్రాలు, పుణ్యక్షేత్రాలు మరియు ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి, అలాగే వైశ్య సంఘాల సమన్వయానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. మహాసభ ఏ బాధ్యతలు ఇచ్చినా సక్రమంగా, నిష్టతో, అంకితభావంతో నెరవేరుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన నియామకానికి సహకరించి, ఈ అవకాశాన్ని కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ చైర్మన్ టి.జి. వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షులు ఇల్లురు లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు పబ్బిశెట్టి సురేష్, కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, ఈసీ మెంబర్ కె వి సుబ్బారావులకు గురుప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

**అభినందనల వెల్లువ :** యెలిశెట్టి వెంకట గురుప్రసాద్ స్టేట్ టూరిజం కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా మైదుకూరు నియోజకవర్గంలోని ఆర్యవైశ్య ప్రముఖులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, హితైషులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# జిల్లా ఆర్యవైశ్య మీడియా కమిటీ వైస్ చైర్మన్ గా ఓరుగంటి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 23)**

వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 204 ఏ రీజనల్ చైర్మన్‌గా సేవలందిస్తున్న ఓరుగంటి చెన్నకేశవరావును, పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ వైస్ చైర్మన్‌గా నియమిస్తూ, పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చెందోలు వికేఎస్ ప్రకాష్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు. 2026-2028 రెండు సంవత్సరాలు పదవిలో కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. పదవీకాలంలో ఆర్యవైశ్య సంఘం ఆశయ సాధన కోసం ఆర్యవైశ్యులను చైతన్యపరిచే విధంగా పనిచేయాలని చెన్నకేశవరావుకు ప్రకాష్‌రావు సూచించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవాన్ని పెంపొందించి, ఆర్యవైశ్యులను జాగృతం చేయడంలో త్రికరణ శుద్ధిగా కృషి చేయాలన్నారు. చెన్నకేశవరావు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం మీడియా కమిటీ వైస్ చైర్మన్‌గా తనను ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. చెన్నకేశవరావును పలువురు ఆర్యవైశ్యులు, జర్నలిస్టులు పట్టణ ప్రముఖులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# వెదురూరులో 'సేవా సంకల్ప అభియాన్' రక్తదానంతో స్ఫూర్తి

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 23)**

నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెదురూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన పురస్కారంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా ఈ సేవా కార్యక్రమాలు సాగుతున్నాయని వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జమ్మలమడుగు డిప్యూటీ ఐవీ&ఎూ డాక్టర్ గీతా రెడ్డి, చాపాడు మండల బిజెపి అధ్యక్షుడు లోమడ సుబ్బరామిరెడ్డి ప్రారంభించారు. ప్రొద్దుటూరు బ్లడ్ బ్యాంక్ బృందం ఆధ్వర్యంలో 10 మంది రక్తదానం చేయగా, దాతలకు పండ్లు, జ్యూస్ అందించి అభినందించారు. అనంతరం యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించి అవగాహన కల్పించారు. అంగన్వాడీ సిబ్బంది అమరావతి, పార్వతి, జయలక్ష్మి, రాజమ్మ, భారతి పాల్గొని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భాను, వైద్య, అంగన్వాడీ, ఆశా సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాణాసంచా దుకాణాల తనిఖీ





**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 23)**

మాచర్ల పట్టణంలోని సాగర్ రోడ్ నందు గల బాణాసంచా దుకాణాలను బుధవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు నిర్వహించాలని, అగ్నిమాపక సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని పలు సూచనలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది తాసిల్దారు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే టిడిపి పాలన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## షేక్ జానీ భాష



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 23)**

పట్టణంలోని 26వార్డులో బుధవారం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న"ఇంటింటికిబితెలగుదేశం" కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలనాడు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ షేక్ జానీ బాషా మాట్లాడుతూ వార్డులోని ప్రతి గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకొని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల వద్దకే టిడిపి.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందే విధంగా చేరవేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వార్డులోని ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ ప్రజల నుంచి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలు అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులోని ప్రజలు అనేక పథకాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. వార్డులోని ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను అధికారుల చేత పరిష్కరింప చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 63 బూత్ ఇంచార్జి కే పార్వతి, టిడిపి సీనియర్ నాయకులు మాజీ ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రసూల్, షేక్ జాన్ అహ్మద్, జనసేన నాయకులు షేక్ ఫారూక్, ముజుకిర్, దేశం శ్రీనివాస్ రెడ్డి, సుందర్ రావు,టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు వంటవారిని, వాచ్ మెన్‌ను నియమించండి

సుజన్ మాదిగ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)

ఒంగోలు అంజయ్య రోడ్ లోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు వంటవారిని, వాచ్మెన్లను, శానిటేషన్ వర్కర్ ను నియమించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజన్ మాదిగ జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి ఫిర్యాదు చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజాబాబును సుజన్ మాదిగ కలిసి మాట్లాడుతూ ఒంగోలు నడిబొడ్డు లోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ కు గత సంవత్సర కాలంగా వంటమనిషి, వాచ్మెన్, శానిటేషన్ వర్కర్లు లేరని ఆయనతో అన్నారు. అదేవిధంగా గిన్నెలు కడగడం, వంట చేసుకోవడం చదువుకోవాల్సిన పిల్లలే వాటిని చేస్తున్నారని, దానివల్ల వారికి చదువుకు ఆటంకం కలుగుతుందని కలెక్టర్ కు గుర్తు చేశారు. 2001లో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ మామిడిపాలెం నుండి ఒంగోలు అంజయ్య రోడ్లోకి మార్చబడిందని, అనేక ఉద్యమాల ద్వారా ఈ హాస్టల్ ఏర్పడిందని సుజన్ మాదిగ తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు వెంటనే స్పందించి, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు లక్ష్మానాయక్‌కు ఫోన్ చేసి ఆగ్రహించారన్నారు. గురువారం లోగా హాస్టల్‌లో వంట మనిషి, శానిటేషన్ వర్కర్, వాచ్మెన్లను నియమించాలని ఆదేశించారని తెలిపారు. సుమారు 200 మంది పిల్లలు చదువుకునే హాస్టల్లో పనిచేసే వారు లేకపోవడం వలన విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని, తక్షణమే వర్కర్లను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పిఎస్ నాయకులు జయరాజు మాదిగ, సింగయ్య మాదిగ, దళిత సేన అధ్యక్షులు చింతలపాలెం బాబు మాదిగ, హాస్టల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో జరుగు అఖిల భారత రైతు కూలీ సంఘం

### 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

### అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కే నాంచార్లు పిలుపు

### అఖిల భారత రైతు కూలి సంఘం జాతీయ మహాసభల పోస్ట్ ఆవిష్కరణ

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 23)



సెప్టెంబర్ 28, 29,30వ తేదీలలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం లో అఖిల భారత రైతు కూలి సంఘం 4వ జాతీయ మహాసభలను ప్రజలు చేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కే నాంచార్లు రైతులు, కూలీలకు పిలుపునిచ్చారు. ఈరోజు ఉలవపాడు మండల కేంద్రంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటలవారిన బీడు భూమిని తన రెక్కల కష్టంతో చదును చేసి తన చెమటతో చేను చెలకలను తడిపి బురద నుండి భువ్వను తీసి ప్రపంచానికి ఆహారం పెడుతున్న రైతు అంతర్జాతీయవి పనిలో బలి అవుతున్నాడని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించి రైతులను వలస కూలీలుగా మారుస్తున్న దయనీయ స్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన వ్యవసాయం గెలవాలి... రైతు నిలవాలి అనే నినాదంతో జరుగుతున్న ఈ అఖిలభారత రైతుకూలీ సంఘం జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని, కావున రైతులు, కూలీలు ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్, జిల్లా కోశాధికారి చలంచర్ల వెంకటేశ్వర్లు, ఎన్ అభిలాష్, కత్తి అంకమ్మరావు, తదితరులు పాల్గొన్నారు.

# భజన భక్తి బృందాల కళాకారుల జిల్లా కమిటీ ఏర్పాటు

## 35 అనుబంధ విభాగాల్లో భాగంగా కమిటీ ఎంపిక







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 23)

నెల్లూరు నగరంలోని జర్నలిస్ట్ భవన్ (ప్రెస్ క్లబ్)లో ప్రజాసత్తా 35 అనుబంధ విభాగాల్లోని హిందూ భజన, భక్తి బృందాల కళాకారుల సత్తా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కమిటీని ప్రజాసత్తా వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు పులగర శోభనబాబు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులగర శోభనబాబు మాట్లాడుతూ 2004 నుంచి ప్రజాసత్తా 35 అనుబంధ సత్తా విభాగాల ఆధ్వర్యంలో కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా 'ప్రజాసేవే పరమాత్మ సేవ' అనే ఆశయంతో ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలకు చెందిన అర్హులైన ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. భజన, భక్తి బృందాల కళాకారులు భక్తిమార్గం, ఉత్సవాల్లో కళా ప్రదర్శనలు, సంకీర్తనలు, దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, ధార్మిక ప్రచారం, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. అపార అనుభవం, అంకితభావం, సేవా నిరతితో పనిచేస్తున్న వారితో జిల్లా కమిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. భజన, భక్తి బృందాల కళాకారులకు ఉచిత వాయిద్య పరికరాలు, ఉచిత రవాణా సౌకర్యం, గుర్తింపు కార్డులు, కళాకారుల పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, భూములు, సబ్సిడీ రుణాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. దేశ, రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో కార్యక్రమాలకు అవకాశం కల్పించి గౌరవ వేతనాలు అందించాలని సూచించారు. ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ కార్యక్రమాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి కళాకారులకు అవకాశం కల్పించి ఆర్థికంగా ప్రోత్సహించాలని కోరారు. అన్ని మండలాల్లో మండల కమిటీల ఏర్పాటు, భజన భక్తి బృందాల నమోదు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాలకు చెందిన కళాకారులు సభ్యత్వం కోసం 9989385993 నంబర్‌కు వాట్సాప్ లేదా ఫోన్ ద్వారా సంప్రదించాలని పులగర శోభనబాబు తెలిపారు.

**జిల్లా కమిటీ :** అధ్యక్షురాలుగా చెంచంగారి కొండయ్య, ఉపాధ్యక్షులుగా ఎల్లంగారి చెల్లయ్య, వావిళ్ల చిన్న గోవిందయ్య, కార్యదర్శిగా కాటంగారి కృష్ణయ్య, సహాయ కార్యదర్శిగా ఆవల యానాదయ్య, జనరల్ సెక్రటరీగా ప్రళయకావేరి రమణయ్య, కన్వీనర్‌గా కోడూరు చిన్న పోలయ్య, కో-కన్వీనర్‌గా వావిళ్ల చిన్న గోవిందయ్య, ట్రెజరర్‌గా బెల్లంకొండ అంకయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కే. నరసింహను ఎంపిక చేశారు.

**మహిళా కమిటీ :** జిల్లా మహిళా కమిటీ అధ్యక్షురాలిగా పామంజి మాధవి, ఉపాధ్యక్షురాలిగా నామాల ఆదిలక్ష్మి, కార్యదర్శిగా కోడి పద్మ, సహాయ కార్యదర్శిగా ప్రళయకావేరి వరమ్మ, ట్రెజరర్‌గా మేకల వరలక్ష్మి, కన్వీనర్‌గా కోడూరు అరుణ, కో-కన్వీనర్‌గా ప్రళయకావేరి బుజ్జమ్మ, కోఆర్డినేటర్‌గా కుమారి మంగమ్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా కే. దేవమ్మను పులగర శోభనబాబు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసత్తా రాష్ట్ర కన్వీనర్ చింతల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 9 పౌర విమానయాన శాఖతో చర్చ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం ముంబైలోని ట్రిడెంట్ హోటల్‌లో కమిటీ చైర్మన్ కె సి వేణుగోపాల్ ఆధ్వర్యంలో 9 పౌర విమానయాన శాఖతో చర్చించారు. ప్రజా మౌలిక వసతులు, ఇతర ప్రజా సేవలపై విధించే రుసుములు, టారిఫ్‌లు, వినియోగదారుల చార్జీల విధింపు, నియంత్రణ అంశాల పై పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఏ, బిసిఏఎస్, ఏఏఐ మహారాష్ట్ర ప్రభుత్వం, ఇతర సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఈ చర్చలు జరిపారు. సిఏజి నివేదిక నెం 31, 2026 ఆధారంగా "భారతీయ రైల్వేల్లో నాన్-సబర్బన్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలు, పారిశుధ్యం" అంశం పై రైల్వే బోర్డు, సెంట్రల్ రైల్వే, వెస్టర్న్ రైల్వే ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఇతర కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 23)

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీ ఏ. సత్యానంద్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఒంగోలు పట్టణంలోని ప్రభుత్వ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున మధ్యవర్తిత్వ న్యాయవాది షేక్ సంధాని మరియు ప్యానల్ న్యాయవాది బచ్చు రాజేష్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టపరమైన రక్షణలు, ఉచిత న్యాయ సహాయం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే న్యాయ సేవల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే, సంకేత భాష ప్రాముఖ్యతను వివరిస్తూ, వినికిడి మరియు మాట్లాడే లోపాలు ఉన్న వ్యక్తులకు సమాజంలో సమాన అవకాశాలు, హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పూనూరులో బలరామకృష్ణుని జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, సెప్టెంబర్ 23)



హిందువుల ఆరాధ్య దైవం, శ్రీకృష్ణ పరమాత్ముని అగ్రజుడైన భగవాన్ బలరామకృష్ణుని జయంతి వేడుకలు మండల పరిధిలోని పూనూరు గ్రామంలో మంగళవారం రాత్రి అత్యంత వేడుకగా జరిగాయి. గ్రామంలో వేంచేసియున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రధాన పూజారి దీవి భావనచార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముందుగా హలాయుధుడు బలరామకృష్ణునికి అత్యంత ప్రీతిపాత్రమైన వ్యవసాయానికి ఉపయోగించే ఆయుధమైన సంవర్తకము (హలం, నాగలి ) కు , ఎద్దుల కాడికి పూజలు చేశారు. అనంతరం భగవాన్ బలరామకృష్ణుని చిత్రపటానికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఎక్కువ సంఖ్యలో హాజరైన భక్తుల చేత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ భక్తులతో పాటు పూర్వ భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు గడగొట్టు రాంబాబు, ఉమ్మడి ప్రకాశం జిల్లా పూర్వ అధ్యక్షులు నర్రా దేవసహాయరావు, సభ్యులు సోమేపల్లి సుభాష్ చంద్రబోస్, బోయపాటి సుబ్బారావు, గన్నమనేని చంద్ర, కృష్ణారావు, కిషోర్ మరియు భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



# నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు

## పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్)

(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, సెప్టెంబర్ 25)

మండలం టీడీపీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు జన్మదిన సందర్భంగా మండల మాజీ తెలుగు యువత అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్) కేక్ కటింగ్ నిర్వహించి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్ సహకారంతో మద్దిపాడు మండలంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉప్పుగుండూరి నాగేశ్వరరావు తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగుతూ, ఇలాగే మరెన్నో పుట్టినరోజులు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పల్లపోతు సాయి చరణ్, పలువురు టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు నాగేశ్వరరావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.







# వైసిపి నుండి టిడిపిలో చేరిన 150 కుటుంబాలు

## టిడిపిలో చేరిన పలువురికి కండువా కప్పి ఆహ్వానించిన ఇంచార్జ్ సూర్యనారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 23)**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు మడకలవారిపల్లెలో వైఎస్సార్‌సీపీకి భారీ షాక్ తగిలింది. వైఎస్సార్‌సీపీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన ఏకంగా 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరడంతో స్థానికంగా టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగం చిన్న సుబ్బారెడ్డి, నాగం పెద్ద సుబ్బారెడ్డి, నాగం శ్రీనివాసులురెడ్డి, మడకల రామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య నేతృత్వంలో ఈ భారీ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి, అబ్జర్వర్ తుగ్గలి నాగేంద్ర ముఖ్య అతిథులుగా హాజరై, నూతనంగా పార్టీలోకి వచ్చిన వారికి టీడీపీ పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై..** ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము టీడీపీలో చేరినట్లు స్పష్టం చేశారు. 150 కుటుంబాల చేరికతో మడకలవారిపల్లెలో తెలుగుదేశం పార్టీ తిరుగులేని శక్తిగా మారిందని టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరింత మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీ కుటుంబంలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.









# శాఖల పనితీరును తెలిపే కేపీఐ లపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 23)**

శాఖల పనితీరును తెలిపే కేపీఐ (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్) ల పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో పలు శాఖలతో ఆయన సమావేశం నిర్వహించి వాటి పనితీరుపై సమీక్షించారు. కేపీఐలను ప్రభుత్వం క్రమంగా సమీక్షిస్తూ జిల్లాల వారీగా పురోగతిని పరిశీలిస్తున్నందున అన్ని శాఖల అధికారులు వీటిపై మరింత శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ చెప్పారు. మన జిల్లాతో సంబంధం లేని అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పొందుపరిస్తే వెంటనే ఆయా విషయాలను శాఖాధిపతుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని తొలగించేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. మొత్తంగా చూస్తే జిల్లా ర్యాంకు మెరుగైన స్థాయిలో ఉండేలా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ సుధాకర్‌రెడ్డి, డిఎఫ్వో (టెరిటోరియల్) వినోద్ కుమార్, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, ఉద్యాన అధికారి గోపీచంద్, జిల్లా సహకార అధికారి శ్రీలక్ష్మి, డిపిఓ అనుపమ, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, డ్వామా పి.డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 23)**

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో పంటల సాగు, తాగు, సాగునీరు, పశు గ్రాసం సభ్యత, వర్షపాతం నమోదు తదితర అంశాలపై ఈ సమావేశంలో ఆయన ఆరా తీశారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేలా ముందస్తుగానే ప్రణాళిక రూపొందించాలని, పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల మధ్య ఆయా విషయాలలో సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలన్నారు. దీనికోసం జిల్లా వ్యవసాయ అధికారిని నోడల్ అధికారిగా నియమించారు. వర్షపాతం, పంటల సాగు, నీటి లభ్యత, అందుబాటులోని పశుగ్రాస నివేదికలను అనుబంధ శాఖల ద్వారా ప్రతిరోజూ తెప్పించుకుని పూర్తిస్థాయి సమాచారాన్ని ఇప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధక అధికారి నాగమణి, సిపిఓ సుధాకర్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

## రబీ విత్తనాలను 100 శాతం సబ్సిడీపై ఉచితంగా అందించాలి
## రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసి కొత్త రుణాలు ఇవ్వాలి
## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలి
## పశుగ్రాసం, తాగునీరు ఉచితంగా అందించాలి
## అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు విస్తృతం చేయాలి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 23)**

ప్రకాశం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, వృత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల ప్రతినిధులు పలు డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రబీ సీజన్‌లో విత్తనాలను 100 శాతం సబ్సిడీపై ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఎరువుల సరఫరాలో కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసి కొత్తగా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు తగినన్ని నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.పశుగ్రాసాన్ని ఉచితంగా సరఫరా చేయడంతో పాటు గ్రామాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేసి నీరు నింపాలని కోరారు. సాగర్ నీటితో చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లను పూర్తిగా నింపాలని డిమాండ్ చేశారుఅన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను విస్తృతంగా కల్పించి కూలీలకు ఉపాధి కల్పించాలని, వ్యవసాయ కూలీల కుటుంబాలకు నెలకు 30 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పమిడి వెంకటరావు, జుజ్జూరి జయంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె జి మస్తాన్, నెరుసుల వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం కార్యదర్శి వి. బాలకోటయ్య, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతయ్య, రైతులు వేజండ్ల సింగయ్య, కనపర్తి సుబ్బారావు, ఉబ్బా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.




# పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటిన మానవత స్వచ్ఛంద సంస్థ

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టంబర్ 23)**

మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మానవ స్వచ్ఛంద సంస్థ సభ్యులచే బుధవారం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ గిరిధర శర్మ, కళాశాల హెడ్మాస్టర్ సిద్దేశ్వర శర్మ, మానవత స్వచ్ఛంద సంస్థ పర్యావరణ పరిరక్షణ అధ్యక్షులు పఠాన్ హబీబ్ ఖాన్, గురు బ్రహ్మానందరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శివపురం మురళీకృష్ణ, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్లటూరులో స్వచ్ఛత హి సేవ




**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 23)**

మండలంలోని వెల్లటూరు గ్రామంలో బుధవారం ఎంపీడీవో సతీష్ బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా డివిజనల్ డెవలప్మెంట్ అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ గ్రామాన్ని, ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రజలు, విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మన్నెం రమణయ్య, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు

# రైతులు తక్కువ కాలపరిమితి పంటలు పండించుకోవాలి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 23)**

మండలంలోని కోటపాడు, రాజోలపాడు గ్రామాల్లో వ్యవసాయ అధికారి వి రాము ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రాము మాట్లాడుతూ పంట సాగు చేసే ప్రతి రైతు సేవా కేంద్రంలో ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎల్ నీ నో ప్రభావం వలన వర్షం తక్కువగా ఉంటుందని కావున రైతులు తక్కువ కాల పరిమితి పంటలైన,రాగి,మినుము, పెసర, బొబ్బర్లు వంటి పంటలు పండించాలని సూచించారు. అనంతరం కోటపాడు లో కంది పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు సూచించారు. ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయ అధికారి మందాకిని, వ్యవసాయ సహాయకులు కిషోర్, హరి, మధు, అనూష, కవిత, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# 20 మంది పేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ చేయూత





**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టంబర్ 23)**

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 20 మంది పేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలకు అవసరమైన నిత్యావసర సామగ్రి అయిన సబ్బులు, డిటర్జెంట్లు, టూత్‌పేస్ట్, బ్రష్‌లు, నెయిల్ కట్టర్లు, షాంపులు, కొబ్బరి నూనె, ఫౌడర్, తదితర వస్తువులను పంపిణీ చేశారు. ప్రతి నెల విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం సంస్థ చైర్మన్, డైరెక్టర్లను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సుధాకర్, ఉపాధ్యాయ బృందం ప్రతినిధులకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు ఎం సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని హెచ్‌ఎం ముత్తోజు సుధాకర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ జి శ్రీనివాసులు, అవార్డు డైరెక్టర్ కె ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 27)

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం రెండో విడత కార్యక్రమాన్ని సెప్టెంబర్ 25న జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణపై జిల్లా అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు, లక్ష్యాలు, శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల సుమారు 2,35,409 మంది పిల్లలు, కిశోర బాల బాలికలకు అల్బెండజోల్ మాత్రలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 25న విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రల పంపిణీ చేపట్టాలని, ఆ రోజు మాత్రలు తీసుకోలేక పోయిన వారికి అక్టోబర్ 5 న మాప్-అప్ కార్య క్రమం ద్వారా అందిం చాలని సూచించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, డిగ్రీ, ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లోని అర్హులైన విద్యార్థులకు మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలకు వెళ్లని పిల్లలు, దివ్యాంగులు, భవిత కేంద్రాల్లోని పిల్లలకు కూడా సమీప అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు అందించాలని తెలిపారు. 1-2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2-19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర ఇవ్వాలని, 1-5 సంవత్సరాల చిన్నారులకు



మాత్రను నీటిలో కలిపి ఇవ్వాలని సూచించారు. మాత్రలను ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పర్యవేక్షణలోనే వేయిం చాలని స్పష్టం చేశారు. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించి ఆరోగ్యకరమైన ఎదు గుదలకు దోహదపడు తుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో గోడపత్రికలు, ఇతర ప్రచార కార్య క్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అల్బెండజోల్ మాత్రల వినియోగంపై తల్లి దండ్రులు, విద్యా ర్థులకు అవగాహన కల్పించాలని, అరుదుగా ఎదురయ్యే ప్రతికూల ప్రభావాలపై తక్షణ వైద్య సేవలు అందించేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు, 108 అత్యవసర వైద్య సేవల వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. కార్య క్రమానికి సంబంధించిన డేటా ఎంట్రీని ఎటువంటి పొరపాట్లకు తావులే కుండా సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ బాల ఆరోగ్య కార్యక్రమం ద్వారా పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకా హార లోపాలు, వ్యాధు లు, అభివృద్ధిలో ఆల స్యం, వైకల్యాలు, దృష్టి, వినికిడి, దంత సమ స్యలు, రక్తహీనత, చర్మవ్యాధులు తదితర ఆరోగ్య సమస్యలను సమగ్రంగా స్క్రీనింగ్ చేసి గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గుర్తించిన పిల్లలకు అవసరమైన చికిత్స, తదుపరి వైద్య సేవలు అందేలా రిఫరల్, ఫాలో అప్ చర్యలు చేపట్టాలన్నారు. పోషకాహార పునరావాస కేంద్రాలు ద్వారా తీవ్ర పోషకాహార లోపం తో బాధపడుతున్న పిల్లలకు అవసరమైన వైద్య చికిత్స, పోషకాహార పునరావాసం అందించడంతో పాటు తల్లిదండ్రు లకు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన,శిక్షణ కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమం విజయ వంతానికి శాఖలు పర స్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే డీసీ డాక్టర్ డి చంద్ర శేఖర్, వైద్య ఆరోగ్య శాఖ డీఎల్‌ఏటీఓ, డీఎంఓ డాక్టర్ కె రాహుల్, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

# హిందూ స్మశానవాటిక అభివృద్ధికి భూమిపూజ

### రూ.10 లక్షల అంచనా వ్యయంతో ప్లాట్‌ఫారం, షెల్టర్ నిర్మాణం

### దాతల సహకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం

### ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టంబర్ 23)

గిద్దలూరు పట్టణంలోని హిందూ స్మశానవాటిక ఎన్నో ఏళ్లుగా కంపచెట్లతో నిండిపోయి ఉండటంతో ప్రజలు దహన సంస్కారాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన ప్లాట్‌ఫారం, షెల్టర్ లేకపోవడంతో వర్షం సమయంలో పార్థివదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించడం మరింత కష్టంగా మారేది. ఈ పరిస్థితిని గమనించిన మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు దాతల సహకారంతో స్మశానవాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టారు. సుమారు రూ.10 లక్షల అంచనా వ్యయంతో దహన సంస్కారాల కోసం ప్లాట్‌ఫారం, ఫ్రేమ్ స్టాండ్లు, షెల్టర్ నిర్మించేందుకు భూమిపూజ నిర్వహించారు. ఈ నిర్మాణ పనులకు సూర్య విద్యానికేతన్ వ్యవస్థాపకులు గురు బ్రహ్మానందరెడ్డి రూ.1.20 లక్షలు, చిలకల నిరంజన్‌రెడ్డి రూ.1.20 లక్షలు విరాళంగా అందించారు. నంది శ్రీనివాసులు 200 బస్తాల సిమెంట్‌ను అందజేశారు.కార్యక్రమంలో మానవతా సభ్యులు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి, కమిషనర్ రమణబాబు, గౌరవ అధ్యక్షుడు గంజి వీరయ్య, అధ్యక్షుడు దప్పిలి గురు బ్రహ్మానందరెడ్డి, మాజీ అధ్యక్షుడు మాలెపాటి సత్యనారాయణరెడ్డి, ఏ సోబు, ట్రెజరర్ విశ్వనాథ్‌రాజు, శివపురం మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# వెదురూరులో 'సేవా సంకల్ప అభియాన్' రక్తదానంతో స్ఫూర్తి





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 23)

నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెదురూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన పురస్కారంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా ఈ సేవా కార్యక్రమాలు సాగుతున్నాయని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జమ్మలమడుగు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గీతారెడ్డి, చాపాడు మండల బిజెపి అధ్యక్షుడు లోమడ సుబ్బరామిరెడ్డి ప్రారంభించారు. ప్రొద్దుటూరు బ్లడ్ బ్యాంక్ బృందం ఆధ్వర్యంలో 10 మంది రక్తదానం చేయగా, దాతలకు పండ్లు, జ్యూస్ అందించి అభినందించారు. అనంతరం యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించి అవగాహన కల్పించారు. అంగన్వాడీ సిబ్బంది అమరావతి, పార్వతి, జయలక్ష్మి, రాజమ్మ, భారతి పాల్గొని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భాను, వైద్య, అంగన్వాడీ, ఆశా సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్‌కి ఆల్ ఇండియా లెవెల్ గోల్డ్ మెడల్

### అబ్ స్టకల్ ట్రైనింగ్‌లో ప్రతిభ

### అభినందించిన కాలేజి యాజమాన్యం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 23)

ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ సీసీ క్యాడెట్ కే విజయ్ అరుదైన ఘనత సాధించాడు. జాతీయస్థాయిలో అబ్ స్టకిల్ ట్రైనింగ్ లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. కాలేజి, జిల్లా, స్టేట్ లెవెల్స్ ని పూర్తి చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్ లో గుంటూరు గ్రూప్ తరఫున ఏపీ నుంచి సెలెక్ట్ అయిన విజయ్ వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఎన్ సీసీ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరఫున గోల్డ్ మెడల్ సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ మేరకు ఎన్ సీసీ క్యాడెట్ విజయ్ ని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి అభినందించారు. ఇలాంటి విజయం సాధించడం గర్వకారణంగా ఉందని ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై వి హనుమంతరావు, వివిధ విభాగాలకు చెందిన డీన్ లు, డైరెక్టర్లు, హెచ్ వోడీలు పాల్గొని విజయ్ ని అభినందించారు. క్విస్ కళాశాలలో ఎన్ సీసీని ఎంతో ప్రోత్సహిస్తారని, యాజమాన్యం సహకారంతోనే జాతీయస్థాయికి వెళ్లగలిగానని విజయ్ ఈ సందర్భంగా తెలియజేశాడు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు.





# శ్రీగిరిలో వైభవంగా శ్రీవారి ఆస్థానం శ్రీవారి జన్మ నక్షత్రమైన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 23)

శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా శాస్రోక్తంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం.. చతుర్వేద పారాయణ.. విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను పద్యాలను గానం చేసారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.





# మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టంబర్ 23)



మాజీ సీఎం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ని తాడేపల్లిలోని వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా వైయస్ జగన్ మోహన్‌రెడ్డి



ఆధ్వర్యంలో జరిగిన గ్రేటర్ విశాఖకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ విశాఖలోని స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పై చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాల పై చర్చించారు. అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రేటర్ విశాఖపట్నం ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జగన్ మోహన్‌రెడ్డి సూచించారని తెలిపారు.

# గానుగపెంట కొండ ప్రాంతంలో దోపిడీ కళ్లలో కారం చల్లి బంగారు చైన్ అపహరణ

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టంబర్ 23)

మండలంలోని పోతలపాడు గ్రామానికి చెందిన గాయం కృష్ణారెడ్డి, ఆయన భార్య రాజేశ్వరి మంగళవారం మార్కాపురం నుంచి స్కూటీ పై స్వగ్రామానికి వస్తున్న విషయాన్ని పసిగట్టిన కొందరు దుండగులు పోతలపాడు గ్రామానికి గానుగపెంట గ్రామానికి మార్గ మధ్యంలో ఉన్న పలకలగైలలో దుండగులు కాపు కాసి బైక్‌తో అడ్డగించి వారి కళ్లలో కారంచల్లి, రాజేశ్వరి మెడలోని బంగారు గొలుసును అపహరించి దుండగులు పరారైనట్లు బాధితులు తెలిసింది. ఈ సంఘటన పై బాధితులు తర్లుపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ బసవరాజు కేసు నమోదు చేసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు.

# కరువు కాటుకు ప్రకాశం....
# ప్రభుత్వం తక్షణ సాయం ప్రకటించాలి

**అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించాలి**
**రైతుల రుణాలు రద్దు చేసి వడ్డీ మాఫీతో రీషెడ్యూల్ చేయాలి**
**కౌలు రైతులకు రూ.2 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ**
**వ్యవసాయ కార్మిక కుటుంబాలకు 50 కిలోల బియ్యం**
**రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలి**
**కేంద్రం నుంచి రూ.లక్ష కోట్ల కరువు సాయం రాబట్టాలి**
**సిపిఎం పార్టీ డిమాండ్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 23)**

వర్షాభావం.. మండుతున్న ఎండలు.. ఎండిపోతున్న పంటలు.. పెరుగుతున్న అప్పులు.. కరువైన వ్యవసాయ పనులు.. పశుగ్రాసం కొరత.. తాగు, సాగునీటి కోసం అల్లాడుతున్న గ్రామాలు.. ఇవన్నీ కలసి ప్రకాశం జిల్లాను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. ఇటీవల అక్కడక్కడా వర్షాలు కురిసినప్పటికీ కరువు ఛాయలు మాత్రం తొలగలేదని సిపిఎం పేర్కొంది. జిల్లాలోని అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికులు, పాడి రైతు కుటుంబాలను ఆదుకునేలా సమగ్ర కరువు ప్యాకేజీ ప్రకటించాలని పార్టీ కోరింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పార్టీ బృందం పర్యటించి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించినట్లు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి తెలిపారు. సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం హరిబాబు, జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు, రాష్ట్ర నాయకులు జి వి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, నాగరాణి మాట్లాడారు. జిల్లాలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 58 శాతం లోటు నెలకొన్నట్లు రమాదేవి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, ఇటీవల కురిసిన వర్షాలను కలుపుకున్నప్పటికీ లోటు అధికంగానే ఉందన్నారు. అనేక గ్రామాల్లో సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోగా, బోర్లు, బావుల కింద సాగు చేసిన కంది, పత్తి, మిర్చి, కూరగాయల పంటలూ తీవ్ర ఎండలకు దెబ్బతిన్నాయని తెలిపారు. రైతులు ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కొందరు తిరిగి పంటలు వేసేందుకు ప్రయత్నిస్తున్నా అవి ఎంతవరకు నిలుస్తాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. గ్రామాల వారీగా, ఎకరాల వారీగా పంట నష్టాన్ని నమోదు చేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కరువు దెబ్బకు పంట నష్టంతోపాటు రైతులపై అప్పుల భారం పెరుగుతోందని పేర్కొన్నారు. రుణాలను కేవలం రీషెడ్యూల్ చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని, వడ్డీని పూర్తిగా మాఫీ చేసి అసలు రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పరిహారం సకాలంలో అందేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెబుతున్న ప్రభుత్వం వాటికి ముందుగానే గిట్టుబాటు ధర ప్రకటించాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ఉచితంగా లేదా రాయితీపై అందించాలని సూచించారు యూరియా, డీఏపీ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల కరువు సహాయం రాబట్టాలని కోరారు.

**కౌలు రైతులపై రెండింతల భారం......**

కరువు కౌలు రైతులను మరింత సంక్షోభంలోకి నెట్టిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం హరిబాబు తెలిపారు.




ముందుగానే కౌలు చెల్లించి సాగు చేసిన రైతులు పంట నష్టంతో అప్పులపాలయ్యారని చెప్పారు. కౌలు రైతుల రక్షణకు రూ.2 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో కౌలు చెల్లింపులకు కనీసం ఏడాది వెసులుబాటు కల్పించాలని, దేవాలయ భూములు సాగు చేస్తున్న కౌలుదారుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. కౌలు రైతుల ఆత్మహత్యలను నివారించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**కూలీలకు పనుల్లేవు.. కుటుంబాలు పస్తులే.....**

కరువుతో వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో వ్యవసాయ కార్మిక కుటుంబాల జీవనం దుర్భరంగా మారిందని రాష్ట్ర నాయకులు నాగరాణి తెలిపారు. ఒకవైపు ఉపాధి లేకపోవడం, మరోవైపు నిత్యావసరాల ధరలు పెరగడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులు తొలగే వరకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని కోరారు. ఇటీవల పట్టణాలుగా మారిన గ్రామీణ ప్రాంతాల్లోనూ కూలీలకు ఉపాధి కల్పించేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు.కరువు తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని జిల్లా కార్యదర్శి ఎస్.కె.మాబు డిమాండ్ చేశారు. కరువు నిబంధనల కింద రైతులకు, కూలీలకు, పశుపోషకులకు అందాల్సిన అన్ని రాయితీలు, ఉపశమన చర్యలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**పశుగ్రాసం కరువు... పాడి రైతులకూ దెబ్బ...**

కరువు ప్రభావం వ్యవసాయానికే పరిమితం కాకుండా పశుపోషణపైనా పడిందని కంకణాల ఆంజనేయులు తెలిపారు. పశుగ్రాసం, నీటి కొరతతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పశువులను కోల్పోకుండా బ్యాంకుల ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని కోరారు.

**చెరువులు నింపి నీటి ఎద్దడి నివారించాలి.....**

జిల్లాలోని చెరువులను సాగర్ జలాలతో నింపి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని జి.వి.కొండారెడ్డి డిమాండ్ చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో లేని మండలాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని తరలించాలని కోరారు. కనీసం ఆరుతడి పంటలకు అవసరమైన నీటిని అందిస్తే రైతుల పంటలను కొంతమేర కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ఎరువుల యాప్ విధానంతో రైతులకు ఇబ్బందులు**

ఎరువుల పంపిణీలో యాప్ ఆధారిత విధానం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందని సిపిఎం నాయకులు విమర్శించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా, డీఏపీ అందుబాటులో లేకపోవడంతో సాగు సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పరిమితుల విధానాన్ని తొలగించి రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. కరువును కేవలం వర్షపాతం లోటుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, రైతు కుటుంబాల జీవనోపాధి, వ్యవసాయ కార్మికుల ఉపాధి, పశుపోషణతో ముడిపడిన సమగ్ర సంక్షోభంగా ప్రభుత్వం చూడాలని సిపిఎం నాయకులు కోరారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి తక్షణం సమగ్ర కరువు కార్యాచరణను ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా పోషణ మాస ఉత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 23)**

మండలంలో కొల్లూరు పాడు గ్రామంలో బిసి కాలనీ నందు బుధవారం సిడిపిఓ డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ కె .రమాదేవి ఆధ్వర్యంలో పోషణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు తల్లులకు పోషకాహారం గురించి అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే బాలామృతం బాలసంజీవునికిట్లు ప్రోటీన్ ఫుడ్స్ పాలు గుడ్లు ఆకుకూరలు జెండా కి ఎన్ని రంగులు ఆ రంగుల వర్ణం ఉన్న ఫుడ్స్ గురించి ఆకుపచ్చని వర్ణంలో ఉన్న ఆకుకూరలుకూరగాయలు తెలుపు వర్ణంలో ఉండే పాలు గుడ్లు, ఫుడ్స్ గురించి క్యారెట్ కూరగాయలు గురించి తెలియజేశారు. ఆరు నెలలు నిండిన తర్వాత బిడ్డకు తినిపించాల్సిన ఆహారం గురించి ఈమునైజేషన్ గురించి. పిఎంఎంవై ప్రధానమంత్రి మాతృత్వ వందన పథకం గురించి అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే ఫుడ్స్ గురించి. తల్లులకు 6 నెలలు నిండిన బిడ్డలకు సమతుల్యమైన ఆహారం, వివిధ రకాలలో ఎలా తినిపించాలి. మాంసాహారం, శాఖాహారం పిల్లలకి ఏ నెలలో ఏ రకాలుగా తినిపించాలి, ఎంత క్వాంటిటీలో తినిపించాలని తల్లులకు తెలియజేశారు. చక్కెర, ఉప్పు, నూనెలు ఎక్కువ వాడకం వల్ల వచ్చే సమస్యల గురించి, గర్భవతిగా ఉన్నప్పటి నుంచి బిడ్డ రెండు సంవత్సరాలు నిండే వరకు వెయ్యి రోజులు తల్లి బిడ్డ సంరక్షణ గురించి తల్లులకి అవగాహన కల్పించారు. అంగన్వాడీ సెంటర్లో అంగన్వాడి కార్యకర్త అమ్మనబ్రోలు సావిత్రి, సహాయకురాలు గర్భిణీలు పాలిచ్చే తల్లులు, పిల్లల తల్లులు అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై అవగాహన




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టంబర్ 23)**

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పురపాలక సంఘం కమిషనర్ పి. శ్రీధర్ నేతృత్వంలో కనిగిరి పురపాలక సంఘం, మార్కాపురం జిల్లా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కమిటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2026 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన వ్యర్థాలు అనే నాలుగు రకాల వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగం నిషేధం, రెడ్యూస్, రియూజ్ , రిసైకిల్ విధానంపై అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచగలమని, పరిసరాల పరిశుభ్రత ప్రజల ఆరోగ్య భద్రతకు ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఆసుపత్రి పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించినందున ఎవరూ ప్లాస్టిక్ కవర్లను ఆసుపత్రిలోకి తీసుకురావద్దని సూచించారు. వ్యర్థాలను బహిరంగంగా కాల్చరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించబడతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట సుబ్బయ్య, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ జిల్లా సభ్యులు గుడ్ హెల్ప్ రమేష్ బాబు, పట్టణ శానిటరీ సెక్రటరీలు, వైద్యులు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, పారిశుధ్య కార్మికులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందించిన ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 23)**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత పోలీస్ కుటుంబానికి గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ చెక్కును బుధవారం జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అందజేశారు. ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ 12.07.2026న ఒంగోలు టౌన్‌లోని పద్మ టవర్స్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ మరియదాసు సతీమణి కె భారతికి రూ. 21,15,000 చెక్కును అందజేశారు. జిల్లా ఎస్పీ కానిస్టేబుల్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలను, పిల్లల చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. ఈ సందర్భంగా అందజేసిన చెక్కు ద్వారా లభించే ఆర్థిక సహాయం కుటుంబానికి కొంతమేర ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసు శాఖ పరంగా మృతిచెందిన సిబ్బందికి అందాల్సిన ఇతర ప్రయోజనాలను కూడా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతిచెందిన సిబ్బంది కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఏదైనా సమస్య ఉన్న నేరుగా తనను కలవవచ్చునని వారి కుటుంబ సభ్యులకు జిల్ల ఎస్పీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# హరితాంధ్ర సాధనకు శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 23)**

హరితాంధ్ర సాధనకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి చెప్పారు. బుధవారం ఆమె అధ్యక్షతన ప్రకాశం భవనంలో జిల్లా హరిత అభివృద్ధి సొసైటీ సమావేశం జరిగింది. రాష్ట్రస్థాయిలో ఏపీ గ్రీన్ సొసైటీ తరహాలో జిల్లాస్థాయిలో డిజిడిఏ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు డీఎఫ్వో (సామాజిక) రాజశేఖర్ ఈ సందర్భంగా వివరించారు. జిల్లాలో అవసరాలను బట్టి వివిధ అధికారులను కూడా ఈ సొసైటీలోకి తీసుకునే సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. 2047 నాటికి 50% పచ్చదనాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందన్నారు. ఈ సొసైటీకి జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా ఉన్న డిపిఓ అనుపమ, ఇంచార్జి డ్వామా పి డి వెంకటేశ్వరరావు, డీఈవో రేణుక, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, డీఎఫ్వో (టెరిటోరియల్) వినోద్ కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ రవి నాయక్, జలవనరుల శాఖ ఇంచార్జ్ ఈఎస్ శివరామ్, డివిజనల్ అభివృద్ధి అధికారులు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. కాగా జడ్పీ సీఈవో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, సిపిఓ, సర్వేశాఖ సహాయ సంచాలకులను కూడా ఈ సొసైటీలోకి సభ్యులుగా చేర్చాలని జాయింట్ కలెక్టర్ చెప్పారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కూడా కమిటీలోకి తీసుకోనున్నారు. హరితాంధ్ర సాధనే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు సాగాలని ఆమె స్పష్టం చేశారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com